# బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

## బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ధారూరు, డిసెంబర్ 23 : గ్రామస్థాయి నాయకులు అందరూ బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. శనివారం ధారూరు మండల పరిధిలోని మున్నూర్ సోమారం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెతుకు ఆనంద్ మాట్లాడుతూ గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సేవకై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల పక్షాన ఉండి వారి సంక్షేమం కోసం పాటుపడుతాని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు రాములు, బిచ్చయ్య, నర్సింహులు, రాజు పాల్గొన్నారు.

# గంజాయి నియంత్రణపై ప్రత్యేక చర్యలు

కొడంగల్, డిసెంబర్ 23: యువత గంజాయి మహమ్మారి బారిన పడి జీవితాలను అంధకారం చేసుకొంటున్నారని, ఇందుకు ముందస్తు నివారణ చేపట్టేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పోలీసు, ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి గంజాయి నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతతో పాటు విద్యార్థులు గంజాయి, గంజాయి, మత్తు పదార్థాల అమ్మకాలపై ప్రత్యేకంగా నిఘా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, సీఐ రాములు, మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏంఈవో రాంరెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు ఎక్సైజ్, పోలీసు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

## పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 23 : పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిగి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 77మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్షాల సహకారం తీసుకొని పరిగిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. హైదరాబాద్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్ల రహదారికి సంబంధించిన ఫైల్ శరవేగంగా కదులుతుందని తెలిపారు. కార్యక్రమంలో పరిగి జడ్పీటీసీ బి.హరిప్రియ, పరిగి, కులకచర్ల ఎంపీపీలు కరణం అరవిందరావు, సత్యమ్మ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, తహసీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

**స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలి**

వికారాబాద్ : స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని పరిగి, తాండూరు శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా, యువజన వారోత్సవాల్లో ఇరువురు శాసనసభ్యులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక అంబేద్కర్ భవనంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించి గ్రూప్ డాన్స్, సాంగ్స్, సోలో డాన్స్, సాంగ్స్, ఫొటోగ్రఫీ, డ్రాయింగ్, వ్యాసరచన, స్పీచ్ పోటీలు యువతకు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హన్మంత్‌రావు, యువజన సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆరు గ్యారంటీల పథకానికి

# దరఖాస్తుల స్వీకరణ

పరిగి, డిసెంబర్ 23 : ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల పథకానికి ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆలోచిస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తరపున పరిగిలోని తుంకలగడ్డలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పాల్గొని క్రిస్మస్ కానుకలు అందజేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలకు దరఖాస్తులకు సంబంధించి ముఖ్యమంత్రి ఆదివారం తుది నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలలో భాగంగా ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తామని, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇతర సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాలు అందించేందుకు నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆనందరావు, పాస్టర్లు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా వైకుంఠ ఏకాదశి

**విశిష్ట పూజలు..**

**ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు**

**శ్రీదేవి, భూదేవి సమేతుడై మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు**

**దారి పొడవునా... శ్రీవారికి మంగళ హారతులు..**

**శోభాయమానంగా వెలిగిన వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం**



కొడంగల్ : ఉత్తర ద్వారం నుంచి శ్రీవారి



కొడంగల్, డిసెంబర్ 23: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమీతుడై ఆ దేవదేవుడు ఏడుకొండలవాడు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనభాగ్యాన్ని కలిగించారు. కొడంగల్ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం దివ్య ఉత్సవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి మంగళహారతులు అందించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేతుడైన శ్రీవారిని మాడవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్తాన మంటపంలో స్వామిని కొలువుదీరి భక్తులకు దర్శన భాగ్యం అందించారు.

తాండూరు : తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం ఆలయాలు వైకుంఠ ఏకాదశి శోభను సంతరించుకొన్నాయి. తాండూరు పట్టణ కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, పాండురంగ స్వామి దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

**ఉత్తర ద్వార దర్శనం**

పరిగి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం పరిగి పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి, లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు. పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పరిగి, పూడూరు జడ్పీటీసీలు హరిప్రియ-ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మలిపెద్ది మేఘమాల-ప్రభాకర్‌గుప్తా దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్పీ బాబయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు స్వామి వారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.



తాండూరు : క్యూలో నిల్చున్న భక్తులు



పరిగి : ఉత్తర ద్వార దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

# విద్యార్థినులకు షీటీమ్స్ రక్ష

తాండూరురూరల్, డిసెంబర్ 23 : విద్యార్థినులకు పోలీసు రక్షణగా ఉంటుందని తాండూరు రూరల్ సీఐ రాంబాబు అన్నారు. శనివారం తాండూరు మండలం, ఐనెల్లి గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు షీ టీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిలు విద్యార్థినులకు ఇబ్బంది పెడితే వెంటనే 100కు డయల్ చేయాలని, పోలీసులు వెంటనే స్పందించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. ఎస్సై మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు కలసిమెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

# బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పరిగి టౌన్, డిసెంబర్ 23 : పొలానికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి కాలినడకన వస్తుండగా బైక్ ఢీకొనడంతో మృతిచెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామానికి చెందిన హరిజన్ చంద్రయ్య(58) పొలానికి వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు బైక్‌పై వెళ్తున్న తిరుమలప్ప హరిజన్ చంద్రయ్యను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం చంద్రయ్యను పరిగి సర్కారు దవాఖానకు తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బైక్‌పై వెళ్తున్న తిరుమలప్పకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

# క్రైస్తవులకు నూతన దుస్తుల పంపిణీ

కొడంగల్, డిసెంబర్ 23: క్రిస్మస్ వేడుకను పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి మంజూరైన నూతన దుస్తులను ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పంపిణీ చేశారు. శనివారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముక్, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.శివకుమార్, నోడల్ అధికారి కృష్ణణ్, తహసీల్దార్ విజయ్‌కుమార్‌లతో కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్‌తో పాటు మండల పరిధిలోని చర్చీల ఫాదర్‌లు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్థలాల పరిశీలన

కొడంగల్, డిసెంబర్ 23 : మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలను డీఐ శివకుమార్, సర్వే డిపార్ట్‌మెంట్ ఏడీ రాంరెడ్డిలతో పాటు తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. మండల పరిధిలోని 135, 1035 తదితర సర్వే నంబర్లలోని ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని కాపాడే దిశగా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని డీఐ, ఏడీలు తహసీల్దార్‌కు సూచించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

దోమ, కులకచర్ల, డిసెంబర్ 23 : కులకచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన ఎస్ వెంకటయ్య చిన్న మంగళారం పాఠశాలకు ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయనను కులకచర్ల బాలికల పాఠశాలలో మండల పీఆర్‌టీయూ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

